క్లుప్తంగా

దీపావళి శుభాకాంక్షలు



వీరఘట్టం: పాలకొండ నియోజకవర్గ ప్రజలందరికీ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి శుభాకాంక్షలు తెలిపారు. వండువలోని తన స్వగృహంలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, పండుగను ప్రజలందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

80 లీటర్ల సారా స్వాధీనం



పట్టుకున్న బైక్, సారాతో పోలీసులు

కొమరాడ: మోటారు సైకిల్‌పై అక్రమంగా సారా తరలిస్తున్న వ్యక్తిని కూనేరు చెక్‌పోస్ట్ వద్ద బుధవారం పోలీసులు పట్టుకునేందుకు ప్రయత్నించగా సదరు వ్యక్తి తప్పించుకుని పారిపోయినట్లు ఎస్సై కె.నీలకంఠం తెలిపారు. మోటార్ సైకిల్, 80 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

సచివాలయం సందర్శన



సచివాలయాన్ని తనిఖీ చేస్తున్న ఎంపీడీవో

జియ్యమ్మవలస: మండల కేంద్రంలోని సచివాలయాన్ని ఎంపీడీవో ఎస్.రమేష్ బుధవారం తనిఖీ చేశారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ప్రతి ఉద్యోగి కార్యాలయానికి సమయానికి వస్తున్నారా లేదా పరిశీలించారు. అక్టోబరులో 94 సేవలకు గాను రూ.9279లకు యూపీఐ ద్వారా రూ.8709 ద్వారా జమచేసినట్లు తెలిపారు. అనంతరం గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



అయ్యప్పకు అభిషేకాలు చేస్తున్న గురుస్వాములు

భామిని: మండలంలోని బత్తిలిలో గల లలిత త్రిపుర సుందరీదేవి ఆలయంలో కొలువైన అయ్యప్పస్వామికి బుధవారం నెయ్యి, కుంకుమలతో అభిషేకాలు నిర్వహించారు. గురుస్వామి తాతబాబు శర్మ ఆధ్వర్యంలో పురోహితులు రంపా శ్రీనివాసస్వామి, అమీన్ కుమార్ శర్మలు పూజలు చేట్టారు.

బీజామృతం తయారీ

బలిజిపేట: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా బీజామృతం తయారీపై బర్లిలో రైతులకు ఐసీఆర్‌పీ లక్ష్మి, తిరుపతిరావు బుధవారం అవగాహన కల్పించారు. రెండు మహిళా సంఘాలకు చెందిన రైతులచే 100లీటర్ల బీజామృతం తయారీ చేయించారు. రైతులు బీజామృతాన్ని వినియోగించి విత్తనశుద్ధి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

వేగవంతంగా ఇంకుడుగుంతల నిర్మాణం

సీతానగరం: ఉపాధి నిధులతో మంజూరు చేసిన ఇంకుడు గుంతల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఎంపీడీఓ త్రివిక్రమరావు అన్నారు. పెదబోగిలి గ్రామంలో జరుగుతున్న ఇంకుడుగుంతల నిర్మాణ పనులను ఆయన బుధవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూగర్భంలో నీటి నిల్వలు పెంచడానికి ప్రతి ఇంటి ముందు, వెనుకనున్న ఖాళీ స్థలాల్లో ఇంకుడు గుంతలు తీయాలని సూచించారు. ఉపాధి వేతనదారుల మస్తరును పరిశీలించి, గుంతల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు.

క్రాస్ కంట్రీ పరుగు పందెంలో సతీష్ ప్రతిభ

సాలూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి వాకాడ సతీష్ క్రాస్ కంట్రీ పరుగు పందెంలో ప్రతిభ కనబర్చి ఆల్ ఇండియా సెలక్షన్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా.కె.ఉషశ్రీ బుధవారం తెలిపారు. ఈ నెల 29న అరకు వ్యాలీలో జరిగిన క్రాస్ కంట్రీ పరుగు పందెంలో కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న సతీష్ బ్రాంజ్ మెడల్‌ను కైవసం చేసుకున్నాడని తెలిపారు. బ్రాంజ్ మెడల్, మెరిట్ సర్టిఫికెట్‌లను పొందడంతో పాటు ఆల్ ఇండియా సెలక్షన్‌కు ఎంపిక య్యాడని పేర్కొన్నారు. సతీష్‌ను ప్రిన్సిపాల్, పీడీ శివాజీ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

కందిసాగుకు అదును ఇదే..



ఏజెన్సీలో కంది సాగు

- సస్యరక్షణతో అధిక దిగుబడులు
- వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు రత్నకుమారి

పాలకొండ రూరల్:

ప్రస్తుత సీజన్ కంది సాగుకు అనుకూలమని.. సస్యరక్షణతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు కె.రత్నకుమారి అన్నారు. ఏజెన్సీ కలబోసి ఉన్న ఈ నియోజకవర్గంలో గిరిజన రైతులతో పాటు మైదాన ప్రాంత రైతులు ప్రస్తుతం కంది పంట సాగుపై ఉత్సుకత చూపుతున్నారు. ఈ పంటలో దిగుబడులు సాధించడంతో పాటు చీడపీడల నుంచి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఎ.డి పలు విషయాలు వెల్లడించారు.

రెండుసార్లు మెత్తగా దున్నాలి..

నీరు త్వరగా ఇంకిపోయే, గరప, ఎర్రరేగడి, చల్కా నేలలతో పాటుగా మురుగు నీరు పోయే నల్లరేగడి నేలలు కంది పంటకు అనుకూలం. ముందుగా నిర్దేశించిన భూమిని రెండుసార్లు దున్ని మెత్తగా తయారు చేయాలి. విత్తనాన్ని శుద్ధిచేసే క్రమంలో రైజోబియమ్‌ను కలిపి విత్తడం వల్ల అధిక దిగుబడులు పొందవచ్చు. సిద్ధం చేసుకున్న భూమిలో నాగళి వెంబడి గాని, సాళ్లలో గొర్రుతో విత్తనాలు వేయాలి. చివరి దుక్కిలో ఎకరాకు రెండు టన్నుల పశువుల ఎరువు వేయడం.. రబీలో 16 కిలోల నత్రజని, 20 కిలోల వంతున భాస్వరం వేయాలి. దీంతో పాటు అంతర్ పంటలు వేయాల్సిన రైతులు ఆ పంటకు తగ్గట్టుగా ఎరువుల ఎంపిక, అవసరమగు మోతాదులో మార్పులను అధికారుల సూచనల మేరకు వాడాల్సి ఉంటుంది.

నీటి యాజమాన్యం...

రబీలో కందికి రెండు తేలికపాటి తడులు అందించాల్సి ఉంటుంది. ఈ తడులు మొగ్గ రాబోయే ముందు ఒకసారి, కాయదశలో ఒకసారి అందించాలి. కలుపు నివారణకు సంబంధించి ఎకరాకు పెండిమిథాలియన్ 30 శాతం లేదా అలాక్లోర్ 50 శాతం మందును లీటరు నీటిలో కలిపి విత్తిన వెంటనే గాని మరుచటి రోజు గాని పిచికారీ చేయాలి. కంది విత్తనాలు వేసిన 30 నుంచి 60 రోజుల మధ్య గుంటకతో లేదా గొర్రుతో అంతరకృషి చేయాల్సి ఉంటుంది.

సస్యరక్షణ..



ముఖ్యంగా పంట పెరిగే దశలో ఆకుచుట్టు పురుగు ఆశించి ఆకును, పూతను చుట్టలుగా చేసుకుని నష్టం కలిగిస్తుంది. దీని నివారణకు 1.6 ఎం.ఎల్ మోనోక్రోటోఫాస్ లేదా 2ఎం.ఎల్ క్వినాల్‌ఫాస్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పూత, పిందె దశలో కాయ తొలుచు పురుగు ఆశించి రంధ్రాలు చేసి గింజలను నాశనం చేస్తాయి. దీని నివారణకు సస్యరక్షణ తప్పక పాటించాలి. కాయకు ఈగ ఆశించిప్పుడు నష్టం బయటకు కనిపించదు. దీని పిల్ల పురుగులు కాయ లోపల ఉండి లేత పచ్చి గింజలను ఆరగిస్తాయి. వీటి నివారణకు 5 శాతం వేపగింజల కషాయం పిచికారీ చేసి తల్లి పురుగును గుడ్లు పెట్టకుండా కొంతవరకు నియంత్రించవచ్చు. అన్ని దశల్లో పంటపై ఈగలు ప్రభావం చూపిస్తాయి. గింజ గట్టిపడే దశలో మోనోక్రోటోఫాస్ 1.6 ఎం.ఎల్ లేదా డైమిథోయేట్ 2 ఎం.ఎల్ లేనిపక్షంలో ఎండోసల్ఫాన్ 2 ఎం.ఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికీర చేయాలి. అంతర పంటగా పెసర, మినుము, సోయా చిక్కుడు, వేరుశనగ వంటి పంటలు వేసుకోవచ్చు. మరిన్ని సలహా సూచనలకు క్షేత్రస్థాయి వ్యవసాయ అధికారులను సంప్రదించాలి.

– కె. రత్నకుమారి, వ్యవసాయ శాఖ ఎ.డి

● పరామర్శ



మండలంలోని తెట్టంగి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అలజంగి ఏలియా తల్లి ఆదమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి బుధవారం తెట్టంగి గ్రామానికి చేరుకుని ఏలియా కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమెతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు లక్ష్మణరావు, పరిసినాయుడు, సతివాడ చిన్నంనాయుడు, తదితరులున్నారు.

– వీరఘట్టం

చిన మంగళాపురంలో..

మండలంలోని చిన్న మంగళాసపురం గ్రామానికి చెందిన బంకి శ్రీరామ్మూర్తినాయుడు కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పరామర్శించారు. ఉద్యోగరీత్యా, రాజకీయంగా శ్రీరామ్మూర్తి ప్రజలకు అందించి సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన లేటు గ్రామానికి తీరని లోటన్నారు. ఆమె వెంట వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కనపాక సూర్యప్రకాష్, సర్పంచ్ గోగుల కల్యాణి, ఎంపీపీ మజ్జి నవీన్‌కుమార్, నల్లి శివప్రసాద్, తదితరులున్నారు.



పాలకొండ రూరల్:

● దీపావళి సందడి..



దీపావళి పండుగ నేపథ్యంలో పట్టణంలోని ప్రధాన మార్కెట్ బుధవారం సాయంత్రం వినియోగదారులతో కళకళలాడింది. బాణసంచా అమ్మకాలకు అధికారులు అనుమతులు మంజూరు చేయడంతో మార్కెట్‌లో పలు దుకాణాలు వెలిశాయి. పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో వచ్చి బాణసంచా కొనుగోలు చేశారు. అలాగే ప్రమిదలు, పూలు, పండ్లు, గృహోపకరణాలకు చెంది షాపులు కూడా కళకళలాడాయి.

– పాలకొండ రూరల్

జోనల్ మలేరియా అధికారి తనిఖీ



ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న జోనల్ మలేరియా అధికారి డాక్టర్ ఎం.శాంతిప్రభ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని రేగిడి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను, రేగిడి పీహెచ్‌సీని, దుడ్డుఖల్లు పీహెచ్‌సీని జోనల్ మలేరియా అధికారి డాక్టర్ ఎం.శాంతిప్రభ బుధవారం తనిఖీ చేశారు. ఈమేరకు రేగిడి ఆశ్రమ పాఠశాలలో మలేరియా కేసులు ఎక్కువగా నమోదౌతుండటంతో పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న వైద్య సేవలు, ఆరోగ్య పరిస్థితులు అక్కడి సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థుల ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అనంతరం ఆయా పీహెచ్‌సీలో రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఆమె వెంట జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి సూర్యనారాయణ, జోనల్ మలేరియా కార్యాలయం ఎంపీహెచ్‌ఈఓ బి.తిరుపతిరావు, వైద్యులు ప్రవీణ్, స్వాతి, మలేరియా హెల్త్ సూపర్‌వైజర్లు కోట రాధాకృష్ణ ఉన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



నదీ తీరంలో ఇసుక సేకరిస్తున్న వారికి సూచనలు చేస్తున్న ఎస్సై ప్రయోగమూర్తి

పాలకొండ రూరల్: నాగావళి నదీ తీరంలో ఇసుక సేకరించే క్రమంలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్సై కె. ప్రయోగమూర్తి అన్నారు. మండలంలోని చిన మంగళాపురం వద్ద నదీతీరంలో వంతెన దిగువ భాగంలో, రక్షిత నీటిబావులను ఆనుకుని ఇసుక తవ్వకాలు చేపట్టడం సరికాదన్నారు. ఈ మేరకు ఇసుక తవ్వకాలు చేపడుతున్న వారికి బుధవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనల మేరకే తవ్వకాలు చేపట్టలని సూచించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి



మధ్యాహ్న భోజన మెనూను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎస్.శేఖర్

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ ఎస్.శేఖర్ అన్నారు. మండలంలోని పి.ఆమిటి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యం, అందిస్తున్న వైద్య సేవలపై ఆరాతీశారు. మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. తరగతి గదుల వద్దకు వెళ్లి విద్యార్థుల్లో విద్యాసామర్థ్యాలను తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల ప్రబలుతున్న దృష్ట్యా విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని, వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని డిప్యూటీ వార్డెన్, హెచ్‌ఎం, ఉపాధ్యాయులకు సూచించారు.

కె.గుమడలో పంటకోత ప్రయోగం



పైరులో కొలతలు తీస్తున్న వెలుగు సిబ్బంది

సీతంపేట: మండలంలోని పీపీ ఈతమానుగూడ పంచాయతీ కె. గుమడలో సామల పంటలో బుధవారం పంటకోత ప్రయోగం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్ పి.నాగేశ్వరరావు మాట్లాడుతూ, సేంద్రియ సాగుతో ఎన్నో ప్రయోజనాలున్నాయన్నారు. పైరులో నాటిన దుబ్బలు, మొలకలను అంచనా వేయగా.. మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉందని చెప్పారు. కార్యక్రమంలో వెలుగు ఏసీఓ వసంత, సీఓలు ఉమ, లావణ్య, గిరిజన రైతులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఆవుదూడ మృతి



మృతి చెందిన ఆవుదూడ

గరుగుబిల్లి: మండలంలోని తోటపల్లి గ్రామంలో పంట పొలాల సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆవుదూడ విద్యుత్ షాక్‌కు గురై బుధవారం మృతి చెందింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ గోడ నిర్మించకపోవంతోనే ప్రమాదం జరిగిందని దూడ యజమాని రొక్కం లక్ష్మణరావు తెలిపారు. ఇప్పటికైనా కంచెలు ఏర్పాటు చేయాలని ఆయనతో పాటు స్థానికులు కోరారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



గిజబలో క్లోరినేషన్ చేపడుతున్న సిబ్బంది

గరుగుబిల్లి: గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టనున్నట్లు ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు తెలిపారు. మండలంలోని గిజబ గ్రామంలో రక్షిత మంచినీటి పథకం, తాగునీటి బోర్లు వద్ద బుధవారం క్లోరినేషన్ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురక్షితమైన తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గ్రామాల్లో తరచూ పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించేలా ఆదేశాలు జారీచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు ఎం.సింహాచలంనాయుడు, ఎం.శంకరరావు, తదితరులున్నారు.

కులవివక్ష రూపుమాపాలి



పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ రమేష్‌నాయుడు

గరుగుబిల్లి: కులవివక్షను రూపుమాపాలని ఎస్‌ఐ పి.రమేష్‌నాయుడు పిలుపునిచ్చారు. మండలంలోని శివ్వాం గ్రామంలో బుధవారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు సామాజిక న్యాయం, పౌర హక్కులపై అవగాహన కల్పించారు. ఆర్టికల్ 17 ప్రకారం పౌరులంతా సమానమేనన్నారు. అందరూ సోదర భావంతో మెలగాలన్నారు. రెండు గ్లాసుల విధానానికి స్వస్తి పలకాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ ఈశ్వరరావు, సిబ్బంది రాజారావు తదితరులున్నారు.

పంట తెగుళ్లపై అప్రమత్తం



కార్యక్రమంలో పాల్గొన్న రైతులు, వ్యవసాయ సిబ్బంది

జియ్యమ్మవలస: మండలంలోని ఇటిక గ్రామం సమీపంలోని పంట పొలాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ జ్యోత్స్న పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరిలో పొట్టదశలో వచ్చే తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.

నిబంధనలు అమలు చేయాలి

పాలకొండ రూరల్: ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని పాలకొండ సీఐ ఎం.చంద్రమౌళి అన్నారు. సర్కిల్ పరిధిలో ఎస్సైలతో బుధవారం ఆయన తన కార్యాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ప్రమాదాలను నియంత్రించే క్రమంలో తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. దీపావళి పండుగను దృష్టిలో పెట్టుకుని అక్రమంగా మందుగుండు సామాగ్రి తరలించడం, నిల్వ చేయడం, అనుమతి లేకుండా విక్రయాలపై దృష్టి సారించాలన్నారు.

పూర్తిస్థాయిలో ఉపాధి పనుల కల్పన



మాట్లాడుతున్న ఏపీడీ శ్రీహరి

గరుగుబిల్లి: వేతనదారులకు పూర్తిస్థాయిలో ఉపాధిపనులు కల్పించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు ఏపీడీ జి.శ్రీహరి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ 2024–25 ఆర్థిక సంవత్సరానికి 1.04 కోట్ల పనిదినాలను వేతనదారులకు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. నవంబర్ 15లోగా గోకులాల నిర్మాణాలను పూర్తిచేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గరుగుబిల్లి మండలానికి 1200 ఇంకుడు గుంతలను మంజూరు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.పైడితల్లి, ఏపీఓ గౌరీనాథ్ తదితరులున్నారు.

అమరవీరులకు జోహార్లు



కొవ్వొత్తులతో ర్యాలీలో పాల్గొన్న పోలీసులు

పాలకొండ రూరల్: విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీస్ అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ సబ్ పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా డీఎస్పీ ఎం.రాంబాబు నేతృత్వంలో బుధవారం ఈ ర్యాలీ జరిగింది. స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్, కోటదుర్గమ్మ కూడలి వయా విశాఖ రహదారి వరకూ ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ.. ప్రజలకు భద్రత అందించే క్రమంలో రక్షకభటులు చూపిస్తున్న ధైర్య సాహసాలు వెలకట్టలేనివన్నారు. కార్యక్రమంలో సీఐ ఎం.చంద్రమౌళి, ఎస్సైలు కె.ప్రయోగమూర్తి, డి.అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఇప్పుడెక్కడ ప్రశ్నిస్తారు..

- సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ దీనమయ్య

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని భద్రగిరి సామాజిక ఆసుపత్రిలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించాల్సిన రాంబాబు అనే వ్యక్తి నిన్న మొన్నటి వరకు ఆసుపత్రిలో కాకుండా ఎమ్మెల్యే ఇంట్లో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహించాడని, అధికార దుర్వినియోగం అయిందని, ఈ అంశాన్ని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఇప్పుడెక్కడ ప్రశ్నిస్తారని ఎంపీపీ కుంబురుక దీనమయ్య ఆరోపించారు. ఈమేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో వైద్యశాఖ రివ్యూ జరుగుతుండగా.. భద్రగిరి సీహెచ్‌సీ వైద్యాధికారి రవికుమార్‌నుపై విధంగా ఎంపీపీ ప్రశ్నించారు. వివరాల్లోకి వెళితే ఇటీవల జియ్యమ్మవలస మండలం చినమేరంగి సీహెచ్‌సీలో సమావేశం ఏర్పాటు చేసిన కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆ ఆసుపత్రిలో పనిచేస్తున్న నైట్‌వాచ్‌మన్(దినసరి కూలీ) విధులకు రాకపోయినా అటెండెన్స్ వేసి జీతాలు ఎలా ఇచ్చారు. అది క్షమించరాని నేరం. ఇది అధికార, ప్రజాధనం దుర్వినియోగం కాదా అని ఆగ్రహిస్తూనే.. ఈ అంశాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తానని అన్నారని గుర్తుచేశారు. గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి సీహెచ్‌సీలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తి ఆసుపత్రిలో విధులకు హాజరౌతున్నానంటూ అటెండెన్స్ వేసుకొని స్థానిక ఎమ్మెల్యే జగదీశ్వరి ఇంట్లో కంప్యూటర్ ఆపరేటర్‌గా ఈనెల 21 వరకు ఎలా పనిచేశారని, ఈ అంశంపై ఎమ్మెల్యే జగదీశ్వరి ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఈ నిర్వాకం అధికార దుర్వినియోగం కాదా.. దీనిపై ఇప్పుడెక్కడ ప్రశ్నిస్తారని ఎంపీపీ దుయ్యబట్టారు. ఇప్పుడు ఉపాధిహామీ పథకం ద్వారా చేపడుతున్న పల్లె పండుగ పనులను గతంలో సర్పంచ్ అధ్యక్షతన తీర్మానాలు చేసినవేనని, అలాంటప్పుడు ఆ పనుల ప్రారంభానికి సర్పంచ్లు, ఎంపీటీసీలకు కనీస సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా ప్రారంభించుకోవడం ఏంటని, ఇదేనా ప్రజాప్రతినిధులకు కూటమి ప్రభుత్వం ఇచ్చే గౌరవం అని దుయ్యబట్టారు. ఈ అంశాన్ని ప్రజాప్రతినిధులు ప్రశ్నిస్తే అభివృద్ధిని అడ్డుకోవడం అంటూ టాపిక్ డైవర్ట్ పాలిటిక్స్‌కు దిగుతారా అని దీనమయ్య నిలదీశారు.

నేడు ధనలక్ష్మీ పూజలు

పాలకొండ రూరల్: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం స్థానిక కోటదుర్గమ్మ దేవస్థానంలో దీపావళి పండుగను పురస్కరించుకుని గురువారం ధనలక్ష్మీ పూజలు నిర్వహించనున్నట్లు ప్రధానార్చకుడు లక్ష్మీప్రసాద శర్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి జరగనున్న పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.